


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

వైఎస్ఆర్ కడప

గురువారం 14 ఆగస్టు 2025

పేజీలు - 08


# విజేత ఎవరో?

**పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ కౌంటింగ్**

**పులివెందుల టీడీపీ అభ్యర్థిగా మారెడ్డి లతా రెడ్డి**

**వైసీపీ అభ్యర్థిగా తుమ్మల హేమంత్ రెడ్డి**



కడప బ్యూరో - మేజర్ న్యూస్

టీడీపీ - వైసీపీ మధ్య అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల ఫలి తాలు నేడు తేలను న్నాయి. అరెస్టులు.. ఘర్షణలు.. ఉద్రిక్తతల మధ్య పోలింగ్ ముగిసిన విషయం తెలిసిందే. పులివెందుల స్థానం నుంచి 11 మంది పోటీ చేయగా అందులో టీడీపీ అభ్యర్థిగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) సతీమణి మా రెడ్డి లతారెడ్డి పోటీ చేశారు. వైసీపీ అభ్యర్థిగా తు మ్మల హేమంత్‌రెడ్డి రంగంలో ఉన్నారు. అదేవిధంగా ఒంటిమిట్ట బరిలోనూ 11 మంది పోటీ లో ఉన్నారు. ఈ రెండు ప్రాంతాల్లో మంగళవారం ఎన్నికలు ముగిశాయి. ఈ ఉప ఎన్నికలు ఆరెస్టులు.. సవాళ్ళు.. ఉద్రిక్తతల మధ్య ప్రశాంతంగా ముగిశాయి. చెదురుముదురు ఘటనలు మినహా చెప్పుకోతగ్గ ఘర్షణలను పోలీసులు నివారించగలిగారు. అయితే పోలింగ్ ..మిగతా 2పేజీలో

# రీపోలింగ్.. బహిష్కరణ..!



కడప బ్యూరో - మేజర్‌న్యూస్

**పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రెండు కేంద్రాల్లో రీపోలింగ్ చేయాలని ఏపీ ఎన్నికల సంఘం బుధవారం తెల్లవారు జామున నిర్ణయం తీసుకుంది. జడ్పీటీసీ స్థానం పరిధిలోని 3(అచివెల్లి), 14(ఈ.కొత్తపల్లి) పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ చేయాలని ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం హుటాహుటిన ఏర్పాట్లు చేసి బుధవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం 5 గంటల వరకు రీపోలింగ్ నిర్వహించారు. 3, 14 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం వెయ్యి మంది ఓటర్లు ఉన్నారు. అయితే పులివెందుల మొత్తం 15 పోలింగ్ కేంద్రాల్లో తాము రీపోలింగ్ అడిగామని, కానీ ఈసీ కేవలం రెండు పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే పోలింగ్ నిర్వహించడాన్ని నిరసిస్తూ వైసీపీ రీపోలింగ్‌ను బహిష్కరించింది. ఆమేరకు కడప ఎంపీ వైయస్.అవినాష్ రెడ్డి ప్రకటన చేశారు. దీంతో వైసీపీ శ్రేణులు రీపోలింగ్‌కు దూరంగా ఉన్నారు. అయితే రీపోలింగ్‌లోనూ కొంత మంది బయటి వ్యక్తులు ఓటింగ్‌లో పాల్గొన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు మంగళవారం ఉప ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఘర్షణలు, నిరసనల మధ్య పోలింగ్ జరిగింది. ఈ రెండు మిగతా 2పేజీలో

**అచివెల్లి, ఈకొత్తపల్లి పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్**

**మంగళవారం అర్ధరాత్రి దాటాక ఈసీ నిర్ణయం**

**వెంటనే రెండు కేంద్రాల్లో రీపోలింగ్‌కు ఏర్పాట్లు చేసిన జిల్లా అధికారులు**

**ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ**

**రీపోలింగ్‌ను బహిష్కరించిన వైసీపీ**

**పోలింగ్ ప్రక్రియకు ఆపార్టీ శ్రేణులు దూరం**

**15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ అడిగాం : ఎంపీ**

**తప్పును కప్పిపుచ్చుకునేందుకు రెండు పోలింగ్ కేంద్రాల్లోనే రీపోలింగ్ డ్రామా**



# మాజీ ఎమ్మెల్యే... డాక్టర్ సుధీర్ రెడ్డి అరెస్టు

**ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అరెస్ట్ కు నిరసన**

**32 మంది వైఎస్ఆర్సిపి కార్యకర్తలపై కేసు నమోదు.**

**సీఐ నాపై కచ్చగట్టి నన్ను చంపాలని ప్రయత్నం చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆరోపణ**

**భారీ పోలీసు బలగాల మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అరెస్ట్ చేసిన పోలీసులు**

**ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్ కు భారీగా చేరుకున్న జనాలు**

ఎర్రగుంట్ల మేజర్‌న్యూస్: ఎర్రగుంట్ల మండల పరిధిలోని నిడుజివ్వి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డిని ఎర్రగుంట్ల పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం గ్రామంలో మీడియా సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ఎర్రగుంట్ల సీఐ నరేష్ బాబు ఆధ్వ ర్యంలో భారీగా పోలీసు బలగాలు వచ్చి మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ..మిగతా 2పేజీలో



# నేడే కౌంటింగ్!

**10 టెబుళ్ళ వంతున ఏర్పాటు.. ఒక రౌండ్‌తోనే పులివెందుల ఫలితం**

**ఒంటిమిట్ట స్థానానికి మూడు రౌండ్లలో లెక్కింపు**

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 14న గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. జిల్లా కేంద్రమైన కడప రిమ్స్ సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ జరగనుంది. ఇందు కోసం సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఏర్పాట్లు పూర్తయ్యాయి. పులివెందుల ఉప ఎన్నిక ఓట్ల మిగతా 2పేజీలో

## ప్రశాంత ఓటింగ్‌ను డైవర్షన్ రాజకీయం చేస్తున్న వైకాపా

**రిపోలింగ్ అడిగిందే వాళ్ళు మళ్ళా బాయకట్ అంటున్న ఎంపీ**

**ప్రజలు మీ వైపు లేరని ఎన్నికలు బాయ్ కట్ అంటున్న ఎంపీ**

**జడ్పీటీసీ ఉప ఎన్నిక రిపోలింగ్ పై ఇంచార్జ్ మంత్రి సవిత బీటెక్ రవి సంచలన వ్యాఖ్యలు**

2లో



# నేడే కౌంటింగ్!

(మొదటి పేజీ తరువాయి)



కౌంటింగ్ కోసం 10 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక రౌండ్‌తోనే ఫలితం తేలనుంది. ఇక ఒంటిమిట్ట ఉపఎన్నిక కౌంటింగ్‌కు 10 టేబుళ్ళు ఏర్పాటు చేశారు. అయితే ఈ ఓట్ల లెక్కింపును 3 రౌండ్లలో పూర్తి చేయనున్నారు. ఒక్కొక టేబుల్ కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు చొప్పున ఉంటారు. ఇలా మొత్తం 30 మంది సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు 60 మంది, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారులు ముగ్గురు, తదితర సిబ్బంది కలిపి దాదాపు 100 మంది కౌటింగ్‌లో పాల్గొంటారు. కాగా, కౌంటింగ్‌లో పాల్గొంటున్న సిబ్బందికి బుధవారం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, జెడ్పీ సీఈవో రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ, ఏఆర్ఓ లు రంగస్వామి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విజేత ఎవరో?

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైనప్పటి నుంచి పులివెందులలో హైటెన్షన్ వాతావరణం చోటు చేసుకుంది. ఎప్పుడు ఎం జరుగుతుందోనన్న ఆందోళన ప్రతి ఒక్కరిలో స్పష్టంగా కనిపించింది. కడప ఎంపీ వైయస్. అవినాష్ రెడ్డిని పోలీసులు ఆరెస్టు చేశారు. దీంతో పోలింగ్ రోజు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీస్ చర్యలపై ఎంపీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఎంపీని అరెస్టు చేసిన విధానంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో పలువురు వైసీపీ నేతలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని ఈ కొత్తపల్లి గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు. కణంపల్లి గ్రామానికి చెందిన కొంత మంది గ్రామస్థులు తాము ఓటు హక్కు వినియోగించు కునేందుకు సహకరించాలని పోలీసుల కాళ్ళపై పడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలింగ్ రోజు జరిగిన వ్యవహారాలపై ఎంపీ అవినాష్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఈసీ పులివెందుల పరిధిలోని 3,14 పోలింగ్ కేంద్రాల్లో బుధవారం పోలింగ్ నిర్వహించింది. ఒంటిమిట్ట జడ్పీటీసీ పరిధి లోను ఘర్షణలు.. స్వల్ప ఉద్దీకృతల మధ్య పోలింగ్ పూర్తయింది. నేడు ఓట్ల కౌంటింగ్ జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఎన్నికలను అధికార టీడీపీ – వైసీపీ మధ్య హెూరా హెూరీగా సాగిందని చెప్పవచ్చు. పులివెందుల జడ్పీటీసీ బాధ్యతను జిల్లా ఇన్చార్జి మంత్రి సవితకు, ఒంటిమిట్ట స్థాన బాధ్యతను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి టీడీపీ అధిష్టానం అప్పగించింది. దీంతో ఈ రెండు స్థానాలను దక్కించు కునేందుకు టీడీపీ నేతలు తీవ్రంగా ప్రయత్నించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి జిల్లా కీలక నేతలు పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాసరెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి బీటెక్ రవిలు పులివెందుల ఎన్నికలో కీలకంగా వ్యవహరించారు. వారికి జిల్లా ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, మాధవి రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్ తదితర నేతలు బాధ్యతలు స్వీకరించి పులివెందులలో టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం పట్టుదలగా పనిచేశారు. అదేవిధంగా వైసీపీ నుంచి కడప ఎంపీ అవినాష్ రెడ్డికి ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ బాధ్యతలు అప్పగించారు. ఆయనకు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్.వి. సతీష్ కుమార్ రెడ్డి అండగా నిలిచారు. వారికి తోడుగా ఎమ్మెల్సీలు పి రామ సుబ్బారెడ్డి, రమేష్ యాదవ్ వంటి నేతలు పార్టీ అభ్యర్థి గెలుపు కోసం శ్రమించారు. ఇలా రెండు పార్టీల నేతలు పులివెందుల ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పలు వివాదాల నేపథ్యంలో ఈ ఎన్నిక రాష్ట్రస్థాయి దృష్టిని ఆకర్షించింది. నేడు జరగనున్న కౌంటింగ్ పై రాష్ట్ర రాజకీయ వర్గాలు ఆసక్తి చూపుతున్నాయి. పులివెందులలో గెలిచి వైసీపీ అధినేత వైయస్ జగన్ ను మానసికంగా దెబ్బతీయాలని టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబు నాయుడు పట్టుదలగా ఉన్నారు. అయితే ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించలేదని వైయస్ జగన్ ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ నేటి ఫలితాల కోసం రాష్ట్ర ప్రజల ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని చెప్పక తప్పదు.

# రీపోలింగ్.. బహిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

స్థానాలను టీడీపీ – వైసీపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. పులివెందులలో వాస్తవ ఓటర్లను ఓటు వేయనీయకుండా బయటి వ్యక్తులు అడ్డుకున్నారని, వారే పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారని, తమ పార్టీ ఏజెంట్లను బూత్‌లలో కూర్చోనీయకుండా దౌర్జన్యం చేశారని వైసీపీ ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో స్వల్ప ఘర్షణలు జరిగాయి. అందువల్ల పులివెందుల మొత్తం పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ కడప వైయస్ఆర్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు మంగళవారం లేఖ రాశారు. పోలింగ్ సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలు వివరాలు ఆధారాలతో సహా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకుని వెళ్లారు. 14వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నిలిపివేయాలని కోరారు. టీడీపీ అరాచకంతో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారని వివరించారు. మంగళవారం ఎన్నికలలో పులివెందులలో 76.44 శాతం, ఒంటిమిట్టలో 81.53 శాతం ఓటింగ్ నమోదైంది. పులివెందులలో మొత్తం 11 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, మారెడ్డి లతారెడ్డి, తుమ్మల హేమంత్‌రెడ్డి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమీషన్ స్పందించింది. మగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత రీపోలింగ్‌కు నిర్ణయం తీసుకుంది. అయితే కేవలం రెండు పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే రీ–పోలింగ్‌కి ఆదేశించింది. బుధవారం అచివెల్లి, ఈ.కొత్తపల్లి బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని సూచించింది. అయితే, మొత్తం పోలింగ్ బూత్‌లలో మళ్ళీ రీ–పోలింగ్ నిర్వహించాలని వైయస్ఆర్‌సీపీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు కోరినప్పటికీ వారి అభ్యర్థనను ఈసీ పట్టించుకోలేదు. ఈసీ ఆదేశాల మేరకు జడ్పీటీసీ పరిధిలోని 3(అచివెల్లి), 14(ఈ.కొత్తపల్లి) పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసి బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభించారు. అయితే రీపోలింగ్‌లోనూ స్థానికులతో పాటు బయటి ప్రాంతాలకు చెందిన కొత్త వ్యక్తులు ఓటర్ల క్యూలైన్లలో కనిపించారు. కాగా ఈ రీపోలింగ్‌లో అచివెల్లి పోలింగ్ కేంద్రంలో మొత్తం 492 ఓట్లు ఉండగా అందులో 337 ఓట్లు పోలైనట్లు తెలుస్తోంది. అంటే 68.50 శాతం పోలింగ్ జరిగింది. అదేవిధంగా ఈ కొత్తపల్లి పోలింగ్ కేంద్రంలో మొత్తం 1273 ఓట్లు ఉండగా అందులో సాయంత్రం 5 గంటల వరకు 641 ఓట్లు పోలైనట్లు అంటే 54.28 శాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

**రీపోలింగ్‌ను బహిష్కరించిన వైసీపీ..**

అయితే రెండు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న రీపోలింగ్‌ను వైసీపీ బహిష్కరించింది. తాము పులివెందుల జడ్పీటీసీ పరిధిలోని మొత్తం 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ కోరామని, అన్ని చోట్ల మా ఏజెంట్లను కూర్చోనివ్వకుండా దౌర్జన్యం చేసి టీడీపీ వారే ఏకపక్షంగా బయటి వ్యక్తులతో పోలింగ్ చేయించారని, వాటి ఆధారాలు చూపుతూ ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేశామని వైసీపీ నేతలు చెబుతున్నారు. అందువల్ల అన్ని కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని, 14న జరిగే కౌటింగ్‌ను నిలిపివేయాలని కోరినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. కానీ, ఈసీ మాత్రం 3,14 పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే రీపోలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడంతో అందుకు నిరసనగా




రీపోలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు పార్టీ ఎంపీ వైయస్.అవినాష్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఈసీ డ్రామా..15 బూత్‌లలో రీపోలింగ్ జరపాలి : ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి డిమాండ్**

పులివెందులలో బుధవారం జరుగుతున్న రీపోలింగ్‌ను వైయస్ఆర్‌సీపీ బహిష్కరిస్తున్నట్టు కడప ఎంపీ అవినాష్ రెడ్డి ప్రకటించారు. చంద్రబాబు ప్రభుత్వం ఆపరేషన్ రిగ్గింగ్‌ను చాలా గొప్పగా చేశారని మండిపడ్డారు. పులివెందులలో ఒక కొత్త సంస్కృతికి చంద్రబాబు తెరలేపారు. ఇదే పరిస్థితి భవిష్యత్తులో చాలా చోట్ల చేయవచ్చు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నిక కమిషన్‌పై ఉంది అంటూ ఘాటు విమర్శలు చేశారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. మంగళవారం జరిగిన పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలు ఎలా జరిగాయో రాష్ట్రం మొత్తం చూశారు. ఇతర నియోజకవర్గాల నుంచి వందలాది మంది టీడీపీ వారు ఎలా బూత్‌లు ఆక్రమించారో అందరికీ తెలుసు. బుధవారం తెల్లవారు జామున 2 గంటలకు కేవలం 2 బూత్‌లలో మాత్రమే రీపోలింగ్ ప్రకటించారు. మేము స్పష్టంగా 15 బూత్‌లలో రీపోలింగ్ జరగాలని, కేంద్ర బలగాలతో ఎన్నిక జరపాలని మేము కోరాం. కేవలం తప్పించుకునేందుకు రాత్రికి రాత్రి కేవలం రెండు బూత్‌లలో రీపోలింగ్ అంటున్నారు. అసలు ఏజెంట్లను కూడా బూత్‌లోకి రానివ్వలేదు. అన్ని ఆధారాలు బయటకు వచ్చాయి. మహిళల ఓట్లను కూడా మగవాళ్లు వేసేశారు. కోర్టుకు ఆశ్రయిస్తామని ఈ రీపోలింగ్ డ్రామాను తెర మీదకు తెచ్చారా?. మా స్టాండ్ 15 బూత్‌లలో రీపోలింగ్ జరపాలి. ఈ రెండు బూత్‌లలో నేడు జరుగుతున్న రీపోలింగ్ మేము బహిష్కరిస్తున్నాం. మొత్తం 15 బూత్‌లలో ప్రజాస్వామ్యం అపహాస్యం అయ్యింది. నిన్న మీడియాను కూడా అడ్డుకుని కెమెరాలు లాక్కున్నారు. గ్రామాల్లోకి వెళ్ళి ప్రజల్ని అడిగితే వాస్తవాలు బయటకు వస్తాయి. పులివెందులలో ఒక కొత్త సంస్కృతికి చంద్రబాబు తెరలేపారు. ఒక గ్రామంలో ఉన్న వైయస్ఆర్‌సీపీని ఎదుర్కోడానికి జిల్లాలో ఉన్న టీడీపీ కేడర్ మొత్తాన్ని దించారు. ఇదే పరిస్థితి భవిష్యత్తులో చాలా చోట్ల చేయవచ్చు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నిక కమిషన్‌పై ఉంది. నిన్న జరిగిన అరాచకాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఇప్పుడు రీపోలింగ్ పెడుతున్నారు. అన్ని సెంటర్లలో పోలీసుల సంపూర్ణ సహకారంతో మా ఏజెంట్స్‌ను బయటకు నెట్టేశారు. 15 ఊర్లలో ప్రజలను అడిగితే నిజానిజాలు తెలుస్తాయి. మీడియాకు విజ్ఞప్తి చేస్తున్నాను.. నిజమైన ఓటర్లను, ప్రజలను ప్రశ్నించి చూడండి. నిజాలు బయటకు వస్తాయి అంటూ ఎంపీ అవినాష్ చెప్పారు.

# ప్రశాంత ఓటింగ్‌ను డైవర్షన్ రాజకీయం చేస్తున్న వైకాపా

**పులివెందుల, మేజర్‌న్యూస్ :** ఈనెల 12వ తారీకు జడ్పిటిసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగిన ఓటింగ్‌ను డైవర్షన్ రాజకీయాలు వైసిపి నాయకులకి చెల్లు బాటు అవుతుందని,రిపోలింగ్ అడిగిందే వాళ్ళు మళ్ళా బాయకట్ అంటున్న జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి ఈ విధంగా చేయడం సిగ్గుచేటు పని అని టిడిపి జిల్లా ఇన్‌చ్చార్జి మంత్రి సవిత పులివెందుల టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి సంచలన వ్యాఖ్యలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పులివెందుల టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఇన్‌చ్చార్జి మంత్రి సవిత జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవిలు మాట్లాడుతూ గత నిన్నటి రోజు జరిగిన జడ్పిటిసి ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశాంతంగా జరిగాయని అన్నారు. కానీ ఎంపీ అవినాష్ రెడ్డి ఎన్నికల కమిషన్ లేనిపోని ఫిర్యాదులు చేసి ఓడిపోతామని సాకుతో, వాళ్ల పార్టీ నాయకులతోనే కార్యకర్తలతో మేము ఎవరము ఓటు వేయలేదని సాకులు చూపించి వారికి ఇష్టం వచ్చినట్టు చేయడం జరిగిందని, వాటిని పరిశీలించి ఎన్నికల కమిషన్ పరిగణములకు తీసుకొని అచ్చి వెల్లి కొత్తపల్లి రెండు చోట్ల ఇబ్బందులు జరిగాయని మళ్లీ రీపోలింగ్ జరపాలని కమిషన్ ఆదేశాలు చేయడం జరిగిందని, ప్రస్తుతం రీపోలింగ్ సజావుగా జరుగుతుందని, మళ్లీ రీపోలింగ్ కావాలని అడిగినది వాళ్లే ఇప్పుడు మళ్లీ బాయికాట్ చేస్తున్నాము అని చెప్పడం ఏమిటి, మళ్లీ 15 పోలింగ్లు రీపోలింగ్ చేయాలని చెప్పడం కొత్త వాదనకు తెరచిస్తున్నారని, మళ్లీ 15 పోలింగ్లో రీపోలింగ్ పెట్టినా కూడా ఇప్పుడు జరుపుతున్న రెండు పోలింగ్లు రీపోలింగ్ రావు అని, ప్రజలు మీ వైపు లేరని,మీరు బాయ్ కాట్ చేయడం కాదు.జడ్పీటీసీ ఉప ఎన్నికలో ప్రజలే మిమ్మల్ని బాయ్ కాట్ చేశారు.నిన్నటి రోజున పులివెందుల జడ్పీటిసి ఉప ఎన్నిక ఎక్కడ కూడా ఏ ఒక్క అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంతంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటింగ్ జరిగింది. అది తట్టుకోలేక డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు.ఓటమి భయంతో వైసీపీ కార్యకర్తలతో ఎన్నికల సంఘానికి వందల మెయిల్స్ పెట్టారు. రిపోలింగ్ అడిగింది వైసీపీనే 15 పోలింగ్ బూత్ కేంద్రాలలో ఎన్నికల కమిషన్ అన్ని పరిశీలించి, ఈ రెండింటికి రిపోలింగ్ జరుపుతున్నారు. రిపోలింగ్ కూడా ప్రశాంతంగా జరుగుతుంది. ఆ రెండు బూతులలో ప్రశాంతంగా ప్రజలు తమ తమ ఓట్లు నిర్వహించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

ప్రెస్‌మీట్ పెట్టనీయకుండానే అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుదీర్ రెడ్డి మాట్లాడుతూ తనపై ఎర్రగుంట్ల సీఐ నరేష్ బాబు వ్యక్తిగతంగా కక్ష్య పెంచుకొని, తనను చంపాలని ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. నేను స్వచ్ఛందంగా నా కార్యకర్తలతో స్టేషనుకు వస్తానని చెప్పిన కూడా పోలీసులు ఎక్కించుకొని స్టేషన్ తరలించడం దారు ణమన్నారు. ఎర్రగుంట్ల సంఘటనలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అరెస్ట్ సంఘటనలో భాగంగా పాల్గొన్న వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తల పైన ఇప్పటి వరకు సుమారు 32 మంది పైన కేసులు బనయించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్ ఆవరణమంతా వైయస్సార్ పార్టీ కార్యకర్తలతో నిండిపోయింది. ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్లో జమ్మలమడుగు డిఎస్పి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పై విచారణ చేపడుతున్నారు.



# యూరియాను తగు మోతాదులో వాడండి

## ఏవో దేవి పద్మావతి



**చాపాడు,మేజర్‌న్యూస్ :** యూరియాను తగు మోతాదులో వాడాలని మండల వ్యవసాయ అధికారి దేవి పద్మాలత అన్నారు. బుధవారం చాపాడు మండలంలోని లక్ష్మీపేట మరియు భద్రిపల్లి రైతుసేవా కేంద్రం పరిధిలోని విశ్వనాథపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అందులో భాగంగా రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంటల బీమాకు సంబంధించి పంట ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం జరిగింది. పచ్చిరొట్టె, జీలుగ, జనుము పంటల ప్రాముఖ్యత గురించి తెలియజేయడం జరిగింది. పంట నమోదు యొక్క ప్రాముఖ్యత గురించి ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు మరియు పథకాల గురించి వివరించడం జరిగింది. వరిలో రైతులు పాటించవలసిన యాజమాన్య పద్ధతులు , మరియు రసాయన ఎరువులు యాజమాన్యం గురించి, ముఖ్యంగా యూరియాను తగిన మోతాదులో వాడాలని సూచించారు. వరి సాగులో తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈవో స్వప్న, ,గ్రామ వ్యవసాయ సహాయకులు శివలక్ష్మి, సుప్రియలు పాల్గొన్నారు.

# బద్వేల్‌ను కడప జిల్లాలో కొనసాగించకపోతే ఉద్యమం తప్పదు

## పీసీసీ సభ్యులు అన్వర్



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** గత కొన్ని రోజులుగా ప్రభుత్వం కొత్త జిల్లాల ప్రతిపాదన తీసుకువచ్చి 26 జిల్లాలుగా ఉన్న రాష్ట్రాన్ని 32 జిల్లాలుగా ప్రతిపాదించి అందులో బద్వేల్ నియోజకవర్గం రాజంపేట జిల్లా ప్రతిపాదన జాబితాలో కనబరుస్తున్నారు. ఈ విషయంపై పునరాలోచన చేసి బద్వేల్ నియోజకవర్గాన్ని వైయస్సార్ కడప జిల్లాలోనే కొనసాగించకపోతే ఉద్యమం తప్పదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి సభ్యులు అన్వర్ ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. ఇప్పుడు ప్రతిపాదిత జిల్లాలుగా చూపుతున్న ప్రాంతాలలో బద్వేల్ నియోజకవర్గం రాజంపేట జిల్లా కేంద్రానికి చాలా దూరంగా ఉందని ఈ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు మండలాలు జిల్లా కేంద్రానికి 120 కిలోమీటర్ల పైగా దూరాన్ని కలిగి ఉన్నాయని అదే కడప జిల్లా కేంద్రానికి అయితే కేవలం 80 కిలోమీటర్లు మాత్రమే ఉన్నదని ఈ అంశాల్ని పరిగణించి ప్రజల అవసరాల దృష్ట్యా మీరు చేసిన ఈ ప్రతిపా దనను విరమించుకొని, కడప జిల్లాలోనే బద్వేల్ నియోజకవర్గాన్ని కొనసా గించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే బద్వేల్ నియోజకవర్గాన్ని కడప జిల్లా లోనే కొనసాగించేంతవరకు అన్ని రాజకీయ పార్టీలు మరియు ప్రజా సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# సొసైటీ చైర్మన్‌గా నియామక పత్రం అందుకున్న మారుతీ



**మైదుకూరు, మేజర్‌న్యూస్ :** మైదుకూరు సహకార సంఘం సొసైటీ చైర్మన్‌గా పాశం మారుతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సొసైటీ బ్యాంకు సీఈఓ విజయభాస్కర్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం పాశం మారుతి మాట్లాడుతూ సహకార సంఘం సొసైటీ చైర్మన్‌గా నన్ను నియమించినందుకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, సొసైటీ అభివృ ద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని మారుతి తెలిపారు.ఎమ్మెల్యే సహకారంతో రైతులకు అవసరమైన రుణాలు,ఎరువులు అందిస్తామని తెలిపారు.

# ప్రజా సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తి రాహుల్ గాంధీ

### కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు జగన్మోహన్ రెడ్డి మాట్లాడటం సబబు కాదు

### పులివెందుల కాంగ్రెస్ ఇంచార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందుల నియోజకవర్గ శాసన సభ్యులు,మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులపై చేసిన వ్యాఖ్యలు ధయ్యాలూ వేదాలు వర్ణించినట్లుగా ఉన్నాయని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జగన్ మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, మాణిక్ ఠాగూర్ గురించి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీకి ఎవరితోనూ హాట్ లైన్‌లో ఉండాల్సిన అవసరం లేదన్నారు. ఆయన ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న వ్యక్తి ఓట్ల చోరిపై రాహుల్ గాంధీ దేశంలో ఒక యుద్ధమే చేస్తున్నారు. మన రాష్ట్రంలో కూడా ఓట్ల చోరీ జరిగింధని మీరు నమ్మితే ఎంపి ఎమ్మెల్యే, కార్యకర్తలు, నాయకులతో ఢిల్లీలో పోరాటం చేయాలని సూచించారు. ఆ పోరాటానికి మా నాయకుడు రాహుల్ గాంధీ మద్దతు ఇవ్వకపోతే అప్పుడూ మాట్లాడాలన్నారు. మా కాంగ్రెస్ పార్టీ ఐసిసి ప్రధాన కార్యదర్శి,ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాణికం ఠాగూర్ మీద జగన్ మోహన్ రెడ్డి మాట్లాడిన తీరు అసలు బాగులేదన్నారు. వాడు వీడు అంటున్నారు. మాణికం ఠాగూర్, పార్లమెంట్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ తరుపున లోక్‌సభ విప్. రాజకీయాల్లో జగన్ మోహన్ రెడ్డి 5 సంవత్సరాలు ప్రతిపక్షంలో ప్రతిపక్షనాయ కుడిగా, 5 సంవత్సరాలు అధికార పక్షంలో ముఖ్యమంత్రిగా, మా రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు ఎంపీ గా, ఒక పార్టీ ఆది నాయకుడుగా ఉన్నారు. మీరు హుందా తనంగా మాట్లాడాలి కానీ ఇటువంటీ వ్యాఖ్యలు చేయడం మీకు తగదన్నారు. మాణిక్యం ఠాగూర్‌కి జగన్ మోహనరెడ్డి క్షమాపణ చెప్పాలని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ తరుపున డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు.

# కడప నగరాన్ని పచ్చదనం పరిశుభ్రతగా ఉంచండి

### కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి



**కడప క్రైమ్, మేజర్‌న్యూస్:** కడప నగరాన్ని పచ్చదనం పరిశుభ్రతగా ఉండేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి కోరారు, బుధవారం నగరంలో నెహ్రూ పార్క్, అక్కడనుండి ఏడు రోడ్లు వరకు ఉన్న పచ్చదనాన్ని పరిశీలించారు. సెవెన్ రోడ్స్, వినాయక నగర్ సర్కిల్, అలంఖాన్ పల్లె సర్కిల్, వరకు ఏర్పాటు చేసిన గ్రీనరీని పరిశీలించారు. పార్కులో పలు అభివృద్ధి పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డ్రంపింగ్ యార్డ్ లో ఉన్న డాగ్ స్టెరిలైజేషన్ సెంటర్ ను పరిశీలించారు. అక్కడున్న స్టెరిలైజేషన్ ఆపరేషన్ రికార్డులను పరిశీలించారు. డంపింగ్ యార్డ్ లో జరుగుతున్న సెగ్రిగేషన్ పనులను త్వరగా పూర్తిచేయాలని అన్నారు, డంపింగ్ యార్డ్‌లో ఉన్న తడి చెత్తను, పొడి చెత్తను వేరువేరుగా డంపు చేయాలని సిబ్బందికి తెలిపారు, అనంతరం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న శానిటేషన్ ఇతరత పనులను. పరిశీలించి వర్షం వల్ల టెంట్‌లపై రైన్ ప్రూఫ్ క్లాత్‌ని ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు,

# డ్రగ్స్ వల్ల జరిగే నష్టంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ

### డ్రగ్స్ అలవాట్లకు వ్యతిరేకంగా సామూహిక ప్రమాణం




**పెండ్లిమర్రి, మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు "నషా ముక్త్ భారత్ అభియాన్ " ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా, యోగి వేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్–9 ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు నేతృత్వంలో డ్రగ్స్ అలవాట్లకు వ్యతిరేకంగా సామూహిక ప్రమాణం తీసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ వల్ల జరిగే నష్టం గురించి అవగాహన కల్పిస్తూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. మంచి సమాజ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో ముఖ్యమైనదన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ముఖ్యమైన కార్యక్రమం. ఈ కార్యక్రమం ద్వారా మేము ఒక శక్తివంతమైన సందేశాన్ని ఇవ్వాలి – "డ్రగ్స్‌కు కొట్టే చెంపదెబ్బ, జీవితానికి ఇచ్చే గౌరవం" అని. అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ యువతను మాదక ద్రవ్యాల బారినుండి దూరం ఉంచడమే నన్నారు. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ముఖ్య ఉద్దేశ్యం. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇలా సామూహిక ప్రమాణం తీసుకోవడం, ర్యాలీలు నిర్వహించడం అభినందనీయం. ఇది సమాజంలో మంచి మార్పు తీసుకురాగలదు. మనందరం కలిసికట్టుగా మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు.

# పిచ్చి మొక్కలతో నిండిన ఆర్టిసి బస్టాండు

### పనిచేయని బాతు రూములు – పారిశుద్ధంపై పట్టించుకోని అధికారులు :సిపిఎం



**కలసపాడు మేజర్‌న్యూస్ :** మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ లో పిచ్చి మొక్కలు మలిచి ఉన్నవి ఆర్టీసీ డిపో అధికారులు గానీ కలసపాడు మండల అధికారులు గానీ పంచాయతీ అధికారులు నాయకులు గానీ చూసి చూడనట్లుగా పోతున్నారే తప్ప పట్టించుకునే వారే లేరని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పగిలి గురవయ్య విలేకరుల తో మాట్లాడుతూ గంట గంటకు ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు బస్టాండ్ లోపల బాత్రూం లెట్రిన్ శుభ్రత లేకపోవడంతో ప్రయాణం చేస్తున్న మహిళలకు చాలా ఇబ్బంది కలిగిస్తున్నటువంటి పరిస్థితి ఇక్కడ కనిపిస్తున్నది అధికారులు నాయకులు ముడుపులు పుచ్చుకోవడం తప్ప మాకేంటి మాకు టయానికి జీతాలు వచ్చే చాలు ఇక్కడ పారిసుభ్రత లేకుంటే మాకేంటి పరిశుభ్రతను బట్టి ఎవరో ఆలోచించడం లేదు ఇక్కడ పయనించే ప్రయనికులు మండలంలోని ప్రజలు అందరు కూడా కలిసి బస్టాండ్ లో ఉన్న చెత్త చెట్టు మొక్కలను చూసి దోమలు బస్టాండ్ లోపల విపరీతంగా పాములు ఉండడంతో దోమలు కాటుకు మలేరియా టైఫాయిడ్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని భయబాంతులకు గురవుతున్నారు బస్టాండ్లో లోపల కూర్చోవడానికి భయపడుతూ బస్సు కోసం బయటనే నిలబడి ప్రయాణం చేస్తున్నారని సిపిఎం కార్యదర్శి గురవయ్య ఆరోపణ వ్యక్తం చేస్తున్నారు దీనిపైన అధికారులు నాయకులు వెంటనే పనులు చేపట్టాలని వారు కోరారు లేనిపక్షంలో భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామ ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుదర్శన్ ఆవాజ్ మండల కార్యదర్శి నాగూర్ వల్లి న తనేల్ మండల ప్రజలు పాల్గొన్నారు

# రీపోలింగ్‌ను బహిష్కరించిన వైసిపి

### దొంగ ఓటర్లను గుర్తించిన తర్వాత మొత్తం 15 బూత్‌లలో రీపోలింగ్ జరపాలని
### జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి డిమాండ్



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందులలో బుధవారం ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న రీపోలింగ్‌ను వైయస్సార్సీపి బహిష్కరించడం జరుగుతుందని, ముందు వెబ్‌కాస్ట్ రీలీజ్ చేసి దొంగ ఓటర్లను గుర్తించిన తర్వాత మొత్తం 15 బూత్‌లలో రీపోలింగ్ జరపాలని జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి డిమాండ్ చేస్తూ హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జరిగిన అరాచకాలను రాష్ట్రం అంతా చూసిందని, కంటి తుడుపు చర్యగా రెండు కేంద్రాల్లో రీపోలింగ్ అంటే సరికాదన్న అసలు ఓటర్లను, ఏజెంట్లను పోలింగ్ బూత్‌లలోకి వెళ్లకుండా అడ్డుకుని ఎలా ప్రజాస్వామ్యయుత ఎన్నికలంటారని ప్రశ్నించారు, వారి అరాచకం బయటకు రాకుండా ఉండాలనే అర్ధరాత్రి 2గంటలకు రెండు బూత్‌లలో రీపోలింగ్ ప్రకటించారని ఆవేదన, అరాచకాలను కప్పిపుచ్చేందుకు, కోర్టుకు వెళ్తామన్న భయంతోనే ఇలా రెండు బూత్‌లలో రీపోలింగ్ ప్రకటించారు. పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు సైతం రీపోలింగ్ బహిష్కరణ, వెంటనే వెబ్ కాస్టింగ్ అభ్యర్థులకు ఇవ్వాలని, భారీ ఎత్తున అక్రమాలను ఆదారాలతో సహా నిరూపి0స్తామని, మొత్తం 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలి, కేంద్ర బలగాల బందోబస్తుతో రీపోలింగ్ జరగాలి అవినాష్ రెడ్డి డిమాండ్ చేశారు.

# సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి

### తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని పేద వారు సద్వినియోగం చేసుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి సూచించారు. స్థానిక నెహ్రూ రోడ్డు లోని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని 70 మంది రోగులకు 48,61,986 రూపాయల సీఎం సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేద కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి సహాయ నిధికి పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు.ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి చొరవతో రాష్ట్రవ్యాప్తంగా సీఎం సహాయ నిధి చెక్కుల్లో ఎక్కువ మొత్తంలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నప్పటికీ అభివృద్ధి సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రజలందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

# నియామక పత్రాలను అందుకున్న సొసైటీ చెర్ పర్సన్

### ఖాదర్ బాషాకు పలువురు అభినందనలు



**రాజుపాళెం, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన రాజుపాళెం లోనిపి. టంగుటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చెర్ పర్సన్‌గా మానిక్రింది ఖాదర్ బాషా నియామక పత్రాలను బుధవారం అందుకున్నారు సహకార సంఘం కార్యాలయంలో ఇంచార్జి సీఈవో బందెల గురవయ్య ఈ నియామక పత్రాలను అందజేశారు. ఖాదర్ భాషాతో పాటు మెంబర్లు గోపు వెంకటేశ్వర్లు, బీరం వెంకట కొండారెడ్డిలకు ఈ పత్రాలను అందించారు. త్వరలోనే సహకారం సంఘం చెర్‌పర్సన్‌గా ఖాదర్ బాషా పాటు మెంబర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఖాదర్ బాషాను మండల టిడిపి నాయకులు కొట్టాల జగన్ మోహన్ రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, గొంగటి వెంకటరెడ్డి, రాచం రెడ్డిశంకర్ రెడ్డి, బిర్లా గోపాల్, గోపు నరసింహులు (బిజెపి) తదితర నాయకులు అభినందించారు.

# జడ్పీటీసీ ఉప ఎన్నికలు చూస్తే ప్రజాస్వామ్యం కూని

### దేశ చరిత్రలో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడు లేదు - ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేశారు
### పోచంరెడ్డి నరేన్ రామాంజుల రెడ్డి




**కమలాపురం, మేజర్‌న్యూస్ :** పులివెందుల, ఒంటిమిట్టలో మంగళవారం జరిగిన జడ్పీటీసీ ఉపఎన్నికలు పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కేలా జరిగాయని కమలాపురం వైఎస్ఆర్సిపి ఇన్‌చార్జ్ నరేన్ రామాంజుల రెడ్డి తీవ్రంగా విమర్శించారు. కమలాపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని ఎన్నికలను రిగ్గింగ్‌కు వేదిక చేసుకుందని ఇది ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు, పులివెందులలో ఓటింగ్ జరుగుతుంటే కమలాపురం టిడిపి వాసులు వచ్చి ఎలా ఓటేస్తారు ఎలక్షన్ రోజున ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వెనుక కుట్ర స్పష్టంగా కనిపిస్తోంది అని ప్రశ్నించారు, దొంగ ఓట్లు వేయడమే కాకుండా ఓట్లు వేశామని సోషల్ మీడియాలో సెల్ఫీలు పెడితే, పోలీసు వ్యవస్థ ఏమి చేస్తుంది అన్నారు, 15 వేల మంది పోలీసులు ఎందుకు, 30 పోలింగ్ బూతుల మధ్య 35 వేల ఓటర్లు ఉన్న స్థలంలో 15 వేల మంది పోలీసులను మోహరించడంలో ఏమిటి అంతర్యం ఎవరిని చూసి ఎవరు భయపడుతున్నారన్నారు, ఒంటిమిట్ట కడప డివిజన్‌కి సంబంధించిన ప్రాంతం కాగా, అన్నమయ్య జిల్లా ఎస్పీ వచ్చి విధులు నిర్వర్తించడం దారుణం, పోలీసుల, అధికారుల సహకారంతో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. వైఎస్సార్సీపీ నాయకులపై దాడులు - మహిళలపై దుర్వ్యవహారం వైఎస్సార్సీపీ ఏజెంట్లపై బైండ్ ఓవర్ కేసులు పెట్టి అరెస్టులు చేయడమే కాకుండా, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించి పోలింగ్ బూతుల కాడికి రానివ్వకుండా వారి దగ్గర స్లిప్పులు లాక్కోవడం ఇది అసహ్యకరమైన చర్య అన్నారు, కూటమి అధికార మదంతో రెచ్చిపోతుంది. ప్రజలు చూస్తూ ఊరుకోరు అని తెలిపారు, మీ దౌర్జన్యాలకు గట్టిగా సమాధానం వస్తుంది పన్నుకు పన్ను, చెంప దెబ్బకు చెంపదెబ్బ, చెప్పుదెబ్బకు చెప్పుదెబ్బ తప్పదని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హెచ్చరించారు, ఎన్నికల సంఘం ఈ పరిణామాలను గమనించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయింది పథకాలు చెప్పినటివి లేవు, వైసీపీలో వచ్చే పథకాలు ఆపారు, ప్రజలు మిమ్మల్ని ఎలా నమ్ముతారు అందుకే మీరు ఇలా దొంగ ఓట్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు, రాష్ట్ర ప్రజలంతా మీరు చేసే అరాచకాలు గమనిస్తున్నారని ప్రతిఫలం తప్పదన్నారు, స్థానికుడు జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డిని అరెస్టు చేశారు, ఎక్కడి నుంచో కూటమి ప్రభుత్వ నాయకులను తీసుకొని వచ్చి ఓట్లు వేపిస్తున్నారు ఇది ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు, ప్రజలకు వైసీపీ ఎప్పుడు అండగా ఉంటుందని కమలాపురం నియోజకవర్గంలో నేను ఇక్కడ ఇన్చార్జిగా తీసుకొని సంవత్సరమైంది నాతో కలిసి పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలని తెలిపారు, మీకు ఎప్పటికీ అండగా ఉంటామన్నారు, ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మర్రి సుబ్బన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# చోరీ, దాడి కేసులో నిందితుడు అరెస్ట్

### వివరాలు తెలిపినరూరల్ సీఐ బాల మద్దిలేటి



**రాజుపాళెం, మేజర్‌న్యూస్:** వివిధ చోరీ సంఘటనలు టంగుటూరులో ఇంటి యజమాని పై దాడి చేసిన నిందితుడు తిమ్మారెడ్డి మహమ్మద్ రఫీని బుధవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు ప్రొద్దుటూరు రూరల్ సిఐ బాల మద్దిలేటితెలిపారు రాజుపాళెంమండలం టంగుటూరు గ్రామంలో పట్టపగలు చోరీ దాడి సంఘటన వివరాలను రూలర్ సిఐ రాజుపాళెం ఎస్ఐ వెంకటరమణ తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు నిందితుడు మహమ్మద్ రఫీ గతంలో జిల్లాలలోని పలు చోరీ కేసులలో నిందితుడని కర్నూలు వెలుగోడు గొనెగండ్ల ఓర్వకల్లు ఉలింది కొండ చాగలమర్రి ఆళ్లగడ్డ తదితర పోలీస్ స్టేషన్లో ఇతనిపై కేసులు నమోదయి ఉన్నాయన్నారు పట్టపగలు తాళాలు వేసిన ఇళ్ళను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడేవారన్నారు ఈనెల 7వ తేదీన నంద్యాల వెంకటసుబ్బయ్య ఇంటికి తాళం వేసి ఉండడాన్ని చూసి సదరు నిందితుడుమహమ్మద్ రఫీ ఇంటి తాళం పగలగొట్టి బీరువాను పగలగొట్టేందుకు ప్రయత్నించడం జరిగింది అన్నారు అంతలో ఇంటి యజమాని అయిన నంద్యాల వెంకటసుబ్బయ్య ఇంటిలోనికి రాగాబీరువానుపగలగొడుతున్న నిందితున్ని ఎవరు నువ్వు అని అడగగా దొంగతనానికి వచ్చిన అని చెప్పి ఇంటి యజమాని పై దాడి చేయడం జరిగింది అన్నారు నంద్యాల వెంకటసుబ్బపై చోరీకి ఉపయోగించిన ఇనుప కర్ర తీసుకొని తలపై రక్త గాయాలు అయ్యేటట్లుగా కొట్టడం జరిగిందన్నారు ఇంటి యజమాని కేకలు వేయడంతో చుట్టుపక్కల ప్రజలు ఇంట్లోకి రావడంతో చోరీ చేస్తున్న మహమ్మద్ రఫీ పారిపోవడం జరిగిందన్నారు నంద్యాల వెంకటసుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజుపాళెం పోలీస్ స్టేషన్లో చోరీ హత్యయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగింది అన్నారు నిందితున్ని గోపాయ పల్లె చెక్ పోస్ట్ వద్ద అరెస్టు చేసినట్టు తెలిపారు టంగుటూరు మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామంలో చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితుడు వద్ద నుండి రికవరీ చేశామన్నారు నిందితుడు మహమ్మద్ రఫీ దువ్వూరుమండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన వాడు అన్నారు చోరీ దాడి కేసులో నిందితుడిగా ఉన్న మహమ్మద్ రఫీని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు సిఐ వివరించారు ప్రజలు చోరీలపై అప్రమత్తంగా ఉండాలన్నారు ఇంట్లో విలువైన వస్తువులు నగదును భద్రపరచుకోవడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు గ్రామాల్లో ఎవరైనా అపరిచిత అనుమానస్పద వ్యక్తులు కనిపించినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు

# కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్:** పటిష్టమైన భద్రతా బలగాల మధ్య.. కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జెడ్పిటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి బుధవారం సాయంత్రం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ అదితి సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూముల్లో.. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన బ్యాలెట్ బాక్సులను అత్యంత సురక్షితంగా భద్రపరచడం జరిగిందన్నారు. కౌంటింగ్ హాలులో ఓట్ల లెక్కింపు సజావుగా, సౌకర్యవంతంగా జరిగేలా సెటప్ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం ఓట్ల లెక్కింపు కోసం ఇప్పటికే సిబ్బందిని ఏర్పాటు చేసి.. మైక్రోఅబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్లు, సూపర్వైజర్లను నియమించి కౌంటింగ్ పై వారికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. రౌండ్ల వారీగా కౌంటింగ్ సమాచారం కోసం మీడియా సెంటర్ నుకుడా ఏర్పాటు చేశామన్నారు. ఏ చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా.. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, ఏఆర్వోలు జాన్ ఇర్విన్, రంగస్వామి, డ్వామా పీడి ఆదిశేషారెడ్డి, డిఎస్పీ వెంకటేశ్వర్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జ్ఞానానికి నిలయాలు గ్రంధాలయాలు

## - ప్రిన్సిపాల్ నాగేంద్ర



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** జ్ఞానానికి నిలయాలు గ్రంధాలయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర అన్నారు. బుధవారం గ్రంధాలయ పితామహుడు డా.సీయాలి రామామృత రంగనాథన్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆధునిక గ్రంధాలయాల అభివృద్ధికి ఆయన నిరంతరం కృషి చేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, ప్రజలకు జ్ఞానాన్ని పెంపొందించే గ్రంధాలయ స్థాపనకు అవిరల కృషి చేశారని, దీంతో లక్షలాది గ్రంధాలయాలు ఆవిర్భావించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంధాలయ అధికారి మాధవరావు, అధ్యాపకులు బాలకొండ గంగాధర్, నాగలక్ష్మిదేవి, మల్లేశ్వరమ్మ, షఫివుద్దీన్, కేశమ్మ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల కారణంగా గ్రామాల్లో పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ

**నీరు నిలవకుండా చర్యలు - మురికి నీరు బురద తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలి - జన ఆరోగ్యాన్ని కాపాడేందుకు గ్రామాల్లో పర్యవేక్షణ - కార్యదర్శులకు - ఎంపీడీవో కేజియా**



**కమలాపురం మేజర్‌న్యూస్ :** వర్షాకాలం నేపథ్యంలో కమలాపురం మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో కేజియా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చారు, వర్షాల వల్ల మురికి నీరు నిల్వడం, బురద పేరుకుపోవడం వల్ల ప్రజారోగ్యానికి హానికరమైన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున, వెంటనే శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు, గ్రామాల్లోని ప్రతి ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, డ్రెయినేజ్, రోడ్ల పక్కన నీరు నిల్వకుండా చూడాలన్నారు, వర్షాల కారణంగా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున జన ఆరోగ్యాన్ని కాపాడేందుకు గ్రామాల్లో చర్యలు తీసుకోవాలన్నారు, ప్రతి గ్రామంలో పర్యవేక్షణ కొనసాగించాలని, పంచాయతీ కార్యదర్శులు స్వయంగా పరిశీలించలన్నారు, ప్రజల ఆరోగ్య భద్రతే ప్రధాన లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# హర్ ఘర్ తిరంగా జయప్రదం చేయాలి

## - బిజెపి అధికార ప్రతినిధి గాలిహరిప్రసాద్



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. బుధవారం ఆ పార్టీ నాయకులతో కలిసి జాతీయ జెండాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జాతీయ జెండాను ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై ఎగరవేయాలిని కోరారు. మహానుభావుల బలిదానంతో స్వాతంత్ర్యం సిద్ధించిందని, జెండాను చూసినప్పుడు దేశం కోసం ఏదైనా చేయాలనే భావన కలుగుతుందన్నారు. ఒకే దేశం, ఒకే జెండా, ఒకే రాజ్యాంగం ఉండాలని బలిదానమైన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకీ ఇదే నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మిరెడ్డి, రామచంద్రారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, తులసినాయుడు, సునీల్, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బద్వేల్ నియోజకవర్గాన్ని కడప జిల్లా పరిధిలోనే పరిపాలన జరగాలి

**బద్వేల్ పట్టణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో కి వినతిపత్రం - అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు**

**బద్వేల్ మేజర్‌న్యూస్ :** బద్వేల్ నియోజకవర్గాన్ని కడప జిల్లా పరిధి లోనే పరిపాలన జరగాలిఅని అన్నమయ్య జిల్లా పరిధిలో బద్వేల్ నియోజకవర్గం విలీనం చేయరాదని బద్వేల్ మునిసిపాలిటీ పట్టణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం నందు బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ కి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన కార్యక్రమంలో భాగంగా కడప జిల్లా పరిధిలో పరిపాలన కొనసాగిస్తున్న బద్వేల్ నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లా పరిధిలో కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆయన తెలిపారు. ఏళ్ల తరబడి కడప జిల్లాలోని బద్వేల్ నియోజకవర్గం అంటే ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం జిల్లాల పునర్విభజన అనే సాకుతో బద్వేల్ నియోజక వర్గాన్ని అన్నమయ్య జిల్లా పరిధిలో విలీనం చేసే ప్రక్రియను విరమించుకోవాలని వారు కోరారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బద్వేల్ నియోజక వర్గాన్ని కడప జిల్లా పరిధిలోని ఉండేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మధ్యలో నియోజకవర్గ ప్రజలకు పరిపాలనాపరంగా ప్రయాణించాలంటే కడప సులువుగా ఉంటుందని అన్నమయ్య జిల్లాలో



విలీనం చేయడం వల్ల పరిపాలనాపరంగా ప్రజలు జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను తీసుకొని పరిగణలోకి తీసుకొని బద్వేల్ నియోజకవర్గం గతంలో మాదిరిగాకడప జిల్లా పరిధిలోని పరిపాలన కొనసాగించ అన్నారు. ఈ కార్యక్రమంలోఅధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి బద్వేల్ గురుమూర్తిగారు శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యక్షులు ధనవంతు రాజేష్ కార్యదర్శి మారేళ్ల శ్రీనివాసులు ,పిచ్చయ్య సత్తార్ అన్వర్ భాష నారాయణ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

# ఎంపీటీసీ ఈశ్వర్ రెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరైన జడ్పీ చైర్మన్



**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె ఎంపీటీసీ ఎల్లటూరి ఈశ్వర్ రెడ్డి తన కుమారుడు ఎల్లటూరి శివ రెడ్డితో కలిసి బుధవారం నాడు నూతన గృహప్రవేశం వేడుకను ఆత్మీయంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. నంది పల్లె విశ్వశాంతి స్కూల్ ఎదురుగా ఉన్న కొత్త గృహంలో, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిగి, గ్రామ ప్రజలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కడప జడ్పీ చైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డి ప్రత్యేక అతిథిగా విచ్చేసి, ఈశ్వర్ రెడ్డి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. “మీ కొత్త గృహం సుఖసంతోషాలు, ఐశ్వర్యం, ఆనందం నిండిన ఆలయం కావాలి అని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని ఈశ్వర్ రెడ్డి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

# శెట్టివారిపల్లెలో బ్రిటిష్ కాలంనాటి నాణేలు




**మైదుకూరు మేజర్‌న్యూస్ :** మైదుకూరు మున్సిపాలిటిలోని శెట్టివారిపల్లె గ్రామంలో బ్రిటిష్ కాలం నాటి నాణేలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయని రచయిత,చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ మీడియాకు తెలిపారు.కొన్ని నెలలు క్రితం శెట్టివారిపల్లి గ్రామంలో గ్రామ దేవత పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట ,నూతన దేవాలయంను నిర్మించారు. అప్పుడు ఈ పోలేరమ్మ విగ్రహం కింద స్వాతంత్రానికి ముందు (బ్రిటిష్ కాలం నాటి) 1911 నుంచి 1945 వరకు ఉన్న నాణేలు ఉన్నాయని తెలిపారు. కాపర్ ,సిల్వర్ తో తయారుచేసిన ఆనాటి కాలంలోని క్వార్టర్ అణా, ఒక్క అణా, వన్ పైస లభ్యమైనట్లు తెలిపారు. వన్ పైస నాణేనికి మధ్యలో రంద్రం ఉందన్నారు.శెట్టివారిపల్లి గ్రామంలో మొట్టమొదటగా పోలేరమ్మ తల్లి విగ్రహ%శీ% కొద్దిగా చిత్రమవ్వటంతో ఊరి పెద్దలు నూతన విగ్రహాన్ని ప్రతిష్టచేశారని వివరించారు. ఆనాటి విగ్రహమే తిరిగి పునః ప్రతిష్ట కొన్ని మాసాల క్రిందట చేశారని తెలిపారు. ఈ నాణేల గురించి శెట్టివారిపల్లె గ్రామానికి చెందిన కొప్పర్తి మహేశ్వర్ రెడ్డి, కొప్పర్తి కిరణ్ కుమార్ రెడ్డి, దంత వైద్యులు కొప్పర్తి నారాయణ రెడ్డి (కె యన్ ఆర్) లు సమాచారం ఇచ్చారని ఆయన రమేష్ వెల్లడించారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణ మహోత్సవంకు 1 లక్ష 12 వేలు విరాళం

**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి సజీవ సమాధి ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన కళ్యాణ మండపంలో శ్రీ మాతా గోవింద మాంబ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి శాశ్వత మాస కళ్యాణ మహోత్సవం జరుగును. పూర్వపు మఠాధిపతి కుమారుడు వీరంబొట్లయ్య స్వామి , మఠం పూజారి బ్రహ్మయ్య ( బెస్తవారిపేట ) ఆధ్వర్యంలోఈ శాశ్వత మాస కళ్యాణ మహోత్సవం నిర్వహించుటకు. 1, లక్ష12 వేలు 116 రు ఉభయ దాతలు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల గ్రామ వాస్తవ్యులు అయిన వి.దయానంద చారి , వి రఘువీరా రెడ్డి. చైత్ర శుద్ధ ద్వాదశి రోజున శాశ్విత మాస కళ్యాణం నిర్వహించుటకు 1,12,116.00 ఇవ్వటం జరిగినది. వీరికి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఫిట్ పర్సన్ సి .శంకర్ బాలాజీ , మేనేజర్ ఎన్ ఈశ్వరచారి ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో మఠం సిబ్బంది శ్రీనివాసులు. పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే రాచమల్లు పోలీసు, పోస్టల్ శాఖకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

### – ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** మాజీ ఎమ్మెల్యే రాచమల్లు పోలీసు, పోస్టల్ శాఖకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో పోలీసుల వైఖరిని నిరసిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, అంతటితో ఆగకుండా రానున్న రోజులలో తిరిగి వైసిపి అధికారంలోకి వస్తే పోలీసులను అవే దుస్తులతో పోస్టుమాన్లుగా విధులు నిర్వహించవలసి వస్తుందని అనుచిత వ్యాఖ్యలు చేయటం పోస్టల్ శాఖను అవమానించే విధంగా ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. పోస్టుమాన్లు వృత్తి రీత్యా ఎందులోనూ తక్కువ కాదని గుర్తు చేస్తూ, ప్పోస్టుమాన్లకు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణలు చెప్పని యెడల వారి విజ్ఞతకే వదిలేస్తామని పోస్టల్ శాఖ మరియు ఉద్యోగులపైన వైకాపా వైఖరేంటో ఈ సంఘటనతో ప్రజలకు స్పష్టత వస్తుందని అన్నారు. పోస్ట్ మ్యాన్ లకు కష్టపడి చదువుకుంటే వచ్చిన ఉద్యోగాలుటని అయినా వీరు సమాజంలో సమానం కాదా, పోస్టు మాన్లు లేకుంటే ఎలా ఉంటుందో ఉహించు కోగలరా అని ప్రశ్నించారు. పోస్టు మాన్లు పోస్టల్ శాఖ చేసే పని సమాజ సేవ లాంటిది అని గుర్తు చేస్తూ, ఇలాంటి వారిని అవమానించడాన్ని తీవ్రంగా ఖండి స్తున్నామన్నారు. వైకాపా నాయకులకు ప్రభుత్వంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా పోలీసులపైన దురుసుగా ప్రవర్తించడం, అనుచిత వ్యాఖ్యలు చేయటం పరిపాటిగా మారిందని, గత అయిదు సంవత్సరాల్లో జిల్లా వ్యాప్తంగా జరిగిన సంఘటనలే ఇందుకు నిదర్శనం అని గుర్తు చేశారు.




# అగస్త్యేశ్వరస్వామి ఆలయ పాలకమండలికి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** పట్టణ నడిబొడ్డున వున్న శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయ పాలకమండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు చేసుకోవచ్చని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, అగస్త్యేశ్వరాలయ ఈఓ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలకమండలి నియామకం కోసం ప్రభుత్వం నుండి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆయన తెలిపారు. కావున ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వారి దరఖాస్తులను కడప దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని ఆయన వివరించారు.

# కానగూడూరు లోవర్షం నకు చౌడు మిద్దె కూలింది




**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని కానగుడూరు గ్రామంలో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి మిద్దె కూలింది అని చిలంకురు మాబు సాహెబ్ తెలిపారు. బుధవారం కానగూడూరు గ్రామానికి చెందిన చిలంకురు మాబు సాహెబ్ కు చెందిన చౌడు మిద్దె కూలింది. మేము నివాసముండే మిద్దె కూలిపోవడంతో ఉండడానికి చోటు లేదని, ఇంటిలోని సామాను లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వ అధికారులు స్పందించి వెంటనే నష్టపరిహారం వచ్చేటట్టు చూసి, అలాగే పక్కా గృహం మంజూరు చేయాలని మాబు సాహెబ్ తెలిపారు.

# స్ట్రెస్ అండ్ మేనేజ్ మెంట్ అంశంపై శిక్షణ కార్యక్రమం




**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో డిఎంహెచ్ఓ కార్యాలయంలో డాక్టర్ రమేష్, ఆర్‌బిఎస్‌కే , ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ పర్యవేక్షణలో "స్ట్రెస్ అండ్ మేనేజ్‌మెంట్" అనే అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణా కార్యక్రమం జిల్లాలోని ఆరోగ్య సిబ్బందిలో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చేపట్టిన కార్యాచరణలలో భాగంగా నిర్వహించబడింది. ఇది ఉద్యోగస్తుల సంబంధిత ఒత్తిడిని గుర్తించడం, దీనిని సమర్థవంతంగా నిర్వహించ డానికి వ్యూహాలు అవగాహన చేసుకోవడంపై దృష్టి సారించింది. జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి స్టాఫ్ నర్సులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సాధు వెంకటేశ్వర్లు, ఫిజియో థెరపిస్ట్ ఆనంద్ బాబు, సైకోయో థెరపిస్ట్ శిల్ప లు పాల్గొన్నారు.

# నష ముక్త్ భారత్ అభియాన్

### మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ




**పులివెందుల మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ అండ్ టూ, ప్రిన్సిపల్ డా.బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నష ముక్త్ భారత్ అబియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయడం జరిగినది. ఈ ప్రతిజ్ఞలో యువత దేశానికి వెన్నెముక వంటి వారని విద్యార్థులు మారకద్రవ్యాల వినియోగము చేయకుండా, జీవితాలను తప్పు త్రోవలో ప్రయాణించకుండా, దేశంలోని యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా చైతన్యం కల్పిస్తూ, మానసికంగా, శారీరకంగా, సామాజికంగా ఆరోగ్యంగా ఉండి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించుటలో తమ వంతు పాత్రను నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్. డా.సి. బాలనారాయణ ఎన్ ఎస్ ఎస్ యూనిట్ వన్ అండ్ టు కోఆర్డినేటర్స్ డా.యు. శ్రీనిత, ఎన్.శ్రీనివాసులు రెడ్డి, డా.కె.విజయలక్ష్మి, డా.రాధిక, గౌతమి పాల్గొన్నారు.

# ఇస్కాన్ కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొనాలి



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** ఈ నెల 16న ఇస్కాన్ కృష్ణాష్టమి వేడుకలలో ప్రజలు విరివిగా పాల్గొనాలని ఇస్కాన్ ప్రతినిధి నిరంజన్ గోవింద్ దాస్ తెలిపారు. బుధవారం స్థానిక ఇస్కాన్ మందిరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అనిబిసెంట్ మున్సిపల్ గ్రౌండ్ నందు నిర్వహిస్తున్నదని, ఈ మహోత్సవంలో ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు మరియు చుట్టుపక్కల గల జిల్లా వాసులందరూ కూడా పాల్గొంటారని, ఈ మహోత్సవానికి హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే భేదం లేకుండా ఇతర సోదర సోదరీమణుల కూడా హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామని, ప్రతి ఇంటింటా కరపత్రం అందజేయడం జరిగిందని వివరించారు. కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా 40 వేల మందికి కృష్ణ బలరాముల దర్శనానంతరం వెన్న లడ్డు ప్రసాదం మరియు సంపూర్ణ అన్నా ప్రసాదం కు ఏర్పాటు చేశామన్నారు. కృష్ణ బలరాములకు నైవేద్యంలో భాగంగా108 రకాల వంటకాలను సమర్పించడం జరుగుతుందని తెలిపారు. శంఖాభిషేకం పుష్పాభిషేకం కూడా నిర్వహించడం జరుగుతుందని, భగవద్గీత భాగవతం ఉపన్యాసంతో పాటు కంస వధ నాటక ప్రదర్శన జరుగుతుందని వివరించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పి కొంతమంది జనాలు బయటి వాళ్లు ఇస్కాన్ సంస్థ తరఫున డబ్బులు వసూలు చేస్తున్నారని మా దృష్టికి వచ్చిందని, జాగ్రత్త వహించాలని, ఈ ప్రొద్దుటూరు పట్టణంలో ఇస్కాన్ సంస్థ కొర్రపాడు రోడ్ లో వివేకానంద క్లాత్ మార్కెట్ ఎదురుగా మాత్రమే ఉన్నదని, ఇస్కాన్ సంస్థకి విరాళాలు ఇవ్వదలచుకున్నవారు ఈ ఇస్కాన్ మందిరంలో ఉన్నటువంటి భక్తులకు మాత్రమే అందజేయాలని లేదా ఇస్కాన్ అకౌంటు ద్వారా చెల్లించాలని సూచించారు.

# రెడ్డి కార్పొరేషన్ కు వెంటనే చైర్మన్ ను నియమించాలి

### – ఒక్క రెడ్డి సంఘమునకు చైర్మన్ ను ఎందుకు నియమించలేదు – అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి – రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుకూటి రామభూపాల్ రెడ్డి – రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు శకుంతల రెడ్డి

**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ లోని పేద రెడ్లను ఆదుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆంధ్రప్రదేశ్ రెడ్డి కార్పొరేషన్ కు చైర్మన్ ను నియమించి కార్పొరేషన్ కు 2000 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి రాష్ట్రంలోని పేద రెడ్లను ఆదుకోవాలని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుకూటి రామభూపాల్ రెడ్డి, రాష్ట్ర మహిళ విభాగం అధ్యక్షురాలు పొన్నపురెడ్డి శకుంతల రెడ్డి లు పేర్కొన్నారు. బుధవారం వారు వేరు వేరు చోట్ల మాట్లాడుతూ గతంలో కొన్ని కులాలకు కార్పొరేషన్ ఏర్పాటుచేసి చేర్మెన్ లను నియమించారు. తిరిగి మంగళవారం 31 కార్పొరేషన్లకు చైర్మన్లు నియమించిన రాష్ట్ర ప్రభుత్వం ఒక రెడ్డి కార్పొరేషన్ కు చైర్మన్ నియమించలేదని వారు తెలిపారు. రెడ్ల మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది అనడానికి ఇదే నిదర్శనం అని రెడ్డి సంఘం నాయకులు అంటున్నారు. రాష్ట్రంలో రెడ్డి కుటుంబలలోని నిరుపేదలకు



సహాయ సహకారాలు అందించేందుకు అఖిల భారత రెడ్డి సంఘం ముందు ఉంటుంది అని వారు తెలిపారు. రాష్ట్రంలో రెడ్ల కుటుంబాలకు ఎక్కడ అన్యాయం జరిగినా అఖిల భారత రెడ్డి సంఘం ముందుండి పోరాడి వారికి అండగా నిలుస్తుందిఅని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏ బిఆర్ ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం



**సింహాద్రిపురం మేజర్‌న్యూస్ :** సింహాద్రిపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో 16వ తేదీ శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు నిర్వహించడం జరిగిందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకొని వేణుగోపాల స్వామి ఆలయంలో ఉదయాస్తమాన స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన, వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం అనంతరం సాయంకాల సమయాన రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి పురవీధుల కోలాటాలతో భజన కార్యక్రమాలు మేల వాయిద్వాల నడుమ గ్రామోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని సింహాద్రిపురం చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు గ్రామ ప్రజలు స్వామివారి పూజలో పాల్గొని వేణుగోపాలస్వామి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు ఆహ్వానం పలికారు.

# ఈహెచ్‌ఎస్ వద్దు

### పాత వైద్య విధానమే ముద్దు.!

### ఎన్.ఎం.యు.ఏ. రీజనల్ ప్రెసిడెంట్ నాగముని



**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** ఎంప్లాయిస్ హెల్త్ స్కీం స్థానంలో వెంటనే పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని ఏపిపిటిడి ఎన్.ఎం.యు.ఏ. రీజనల్ ప్రెసిడెంట్ నాగముని డిమాండ్ చేశారు.ప్రభుత్వపరంగా, సంస్థ పరంగా ఏపిపిటిడి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం ఎన్.ఎం.యు.ఏ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద రెండో రోజు గేట్ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన నాగముని మాట్లాడుతూ ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రిటైర్డ్ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణాలకు అనుమతించాలని కోరారు.కార్యాలయ సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.మహిళా ఉద్యోగులకు జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని విన్నవించారు.డిపో ప్రెసిడెంట్ జయరామయ్య మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.గ్యారేజ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపిపిటిడి ఎన్.ఎం.యు.ఏ గ్యారేజ్ కార్యదర్శి మల్లేష్ , సుబ్బారాయుడు, డిపో జాయింట్ సెక్రటరీ లక్ష్మయ్య,సి.ఎస్.రెడ్డి,రాఘవ తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగస్తులకు తక్షణమే పిఆర్సి కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** ఉద్యోగస్తులకు తక్షణమే పిఆర్సి కమిషన్ ను ఏర్పాటు చేయాలని ప్రొద్దుటూరు డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ టి ఆర్ జి రెడ్డి తెలిపారు. బుధవారం ఏపీఎస్ ఆర్టీసీలో ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయుఏ రాష్ట్ర కమిటీ రెండు రోజుల ధర్నా కార్యక్రమానికి ఇచ్చిన పిలుపుమేరకు ప్రొద్దుటూరు డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ టి ఆర్ జి రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్యారేజీ గేటు వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భాను ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగస్తులకు తక్షణమే పిఆర్సి కమిషన్ ను ఏర్పాటు చేయాలని, గవర్నర్ పేట 2 డిపోను లులు ప్రైవేటు సంస్థకు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని,వేతన సవరణ అయిపోయి ఇప్పటికే రెండు సంవత్సరాలు పూర్తయినందున వెంటనే ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు డిఏలను తక్షణమే చెల్లించాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు మరియు టెర్మినల్ ఎన్కాష్మెంట్ చెల్లింపులు తక్షణమే చేయాలని, ఖాళీగా ఉన్న ఎనిమిది వేల పోస్టులను డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయాలని, నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్స్ ను వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగస్తుల అపరిస్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఈ హెచ్ ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఎలక్ట్రిక్ బస్సులను స్వయంగా ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని,



తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగస్తులకు ఓడీలను కేటాయించాలని, రిటైర్ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణాలకు అనుమతించాలని, ఎన్ఎంయుఏ రాష్ట్ర కమిటీ తదుపరి కార్యాచరణ ఏమి ఇచ్చినాను కట్టుబడి ఉంటామని వివరించారు. ఏపీఎస్ఆర్టీసీలో ఎక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు అక్కడే క్యాడర్ స్ట్రెంత్ లో ఉండే విధంగా అమలు చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు ఐవరప్పా, వై బాబు గ్యారేజ్ సెక్రటరీ అశోక్, శేఖర్, దస్తగిరి, రవి అధిక సంఖ్యలో ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వర్షపు నీరు నిలవకుండా చర్యలు

### వర్షాల వల్ల వ్యాధుల ముప్పు పెరగవచ్చు

### పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

### పంచాయతీలకు ఆదేశాలు - ఎంపీడీవో శ్రీధర్



**వల్లూరు మేజర్‌న్యూస్ :** వర్షాలు పెరిగిన సందర్భంగా వల్లూరు మండల పరిధిలోని గ్రామాల్లో మురికి నీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వల్లూరు మండల ఎంపీడీవో శ్రీధర్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు, ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు సరిగ్గా కాల్వల ద్వారా పోవడంతో పాటు, బురద, చెత్త నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం సహా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు, వర్షాకాలంలో దోమల వల్ల వచ్చే వ్యాధులు, నీటి ద్వారా వ్యాపించే రోగాల ముప్పు ఎక్కువ, ప్రతి గ్రామంలో పరిశుభ్రత పాటించడం అత్యవసరం అన్నారు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అధికారికంగా ఆదేశాలు జారీ చేసి సమాచారం గ్రామాల్లో పరిశుభ్రతను పర్యవేక్షించేందుకు మానిటరింగ్ చేయాలని తెలిపారు, ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామ పంచాయతీ బాధ్యతగా వ్యవహరించాలన్నారు..

# ఫిజియోథెరపి పరికరాలతో మెరుగైన సేవలు

### - ప్రభుత్వ ఫిజియోథెరపి డా.దీప



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** వృద్ధుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం పిహెచ్సి, సిహెచ్సి వైద్య కేంద్రాల్లో జెరియాట్రిక్ క్లినిక్ లను ప్రారంభించిందని, దీని ద్వారా వృద్ధులకు అత్యాధునిక పరికరాలతో మెరుగైన ఫిజియోథెరపి సేవలను అందించనున్నట్లు ప్రభుత్వ ఫిజియోథెరపి డా.దీప వెల్లడించారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ సభాభవనంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.ఖాజా మొహిద్దీన్ ఆదేశాల మేరకు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టేషనరీ సైకిల్, ఐఆర్ఆర్ ల్యాంప్, వాకర్స్, షోల్డర్ వీల్, గైట్ ట్రైనర్ వంటి పరికరాలతో వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. వీటి వినియోగం, ఉపయోగాలపై వైద్య సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చారు. అలాగే సైకియాట్రిస్ట్ వైద్యులు డా. కవిత, మానసిక ఆరోగ్యానికి సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డా. విష్ణు, పిహెచ్సి స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

# బద్వేల్ నియోజకవర్గాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలి

### రాజకీయ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** కడప జిల్లాలో కొన్ని సంవత్సరాల కాలం నుండి ఉన్న బద్వేల్ నియోజకవర్గాన్ని ప్రస్తుతం రాజంపేట జిల్లా కేంద్రంలోకి కలపాలన్న ప్రభుత్వ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని రాజకీయ, ప్రజాసంఘాల మరియు నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యుల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. దాదాపు 150 కిలోమీటర్లు ప్రయాణం చేయాలంటే చాలా కష్టంగా ఉంటుంది. 85 కిలోమీటర్ల దూరంలో ఉన్న కడపజిల్లాలో కాకుండా రాజంపేట జిల్లా కేంద్రంలో కలపడం అన్యాయమని వారు పేర్కొన్నారు. బద్వేల్ నియోజకవర్గంలో ఉండే అన్ని ప్రజా సంఘాలు సిపిఎం, సిపిఐ, బిజెపి, జనసేన, కాంగ్రెస్, వైఎస్ఆర్సిపి, టిడిపి మరియు మానవ హక్కుల సంఘాలు ముక్తకంఠంతో తీర్మానం చేస్తూ బుధవారం పోరుమామిళ్ల పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద వేలమంది సంతకాలు సేకరించి జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర ప్రభుత్వానికి వివరించడం జరుగుతుందన్నారు. అలా కానీ పక్షంలో నియోజకవర్గం లో పెద్ద ఎత్తున ఉద్యమ కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జున రెడ్డి, నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ముత్యాల ప్రసాద్ రావు. పోరుమామిళ్ల మండల జడ్పిటిసి ముత్యాల ప్రసాదు, మండల ఉపాధ్యక్షులు సీఎం భాష, రంగసముద్రం గ్రామపంచాయతీ టిడిపి ఇంచార్జ్ సుబ్బారావు. రామసముద్రం పంచాయతీ సర్పంచ్ చిత్త రవి ప్రకాష్ రెడ్డి,




వైయస్సార్సీపి జిల్లా కార్యదర్శి చాపాటి నారాయణరెడ్డి, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బండి ఓబులేసు.రాజీవ్ బాషా. జనసేన పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మయ్య. సిపిఎం మండల అధ్యక్షులు భైరవ ప్రసాద్. నేషనల్ హ్యూమన్ రైట్స్ సెక్రటరీ బెల్లంకొండ పని రావు. ఎంఈఎఫ్ ఈశ్వరయ్య శ్రీనివాసులు రెడ్డి. సీనియర్ దళిత సంఘం నాయకులు ముత్యాల చెనరాయుడు. సిపిఐ మండల కార్యదర్శి రవి. రాజా సాహెపేట సర్పంచ్ గాజులపల్లి జనార్దన్ రెడ్డి. బీసీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు నాగిపోగు మనోజ్. బొజ్జ పుల్లయ్య. బి కోడూరు మండలం సిపిఐ మండల కార్యదర్శి ఎర్రవల్లి ప్రసాద్ రావు. ఉపాధ్యాయ సంఘం నాయకులు కార్మిక సంఘం నాయకులు మాల మహానాడు సంఘం నాయకులు విద్యార్థుల సంఘం నాయకులు మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

# అన్యాయంతో గద్దెనెక్కలేమని గుర్తు పెట్టుకోవాలి

## - తమకు కావాల్సిన వ్యక్తులను గెలిపించాలని అనుకుంటే ప్రజాస్వామ్యం ఎందుకు?
## - డీఐజీ వ్యాఖ్యలు నాగరిక ప్రపంచం తలదించుకునేలా మారింది
## - వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ రెడ్డి

**వేంపల్లె మేజర్‌న్యూస్ :** ఏ ఒక్కరూ అన్యాయంతో గద్దెనెక్కలేమని, ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరించారని మండిపడ్డారు. స్వతంత్ర అభ్యర్థి సైదాపురం సురేష్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రాము, హేమాద్రీ లపై టిడిపికి చెందిన కొంతమంది దాడులు చేశారన్నారు. వాహనాలపై పెట్రోల్ పోసి చంపాలని అనుకున్నారన్నారు. దాడులు చేసిన వారిపై కేసులు పెట్టకుండా తమ పార్టీకి చెందిన వారిపైన పోలీసులు కేసులు పెట్టారన్నారు. ఈ సంఘటనకు సంబంధించి డీఐజీ వెటకారంగా మాట్లాడారని, పత్తి వ్యాపారం చేసుకునేందుకు వెళ్లారా? మేము లేకుంటే తలలు లేచేవని డీఐజీ మాట్లాడిన వ్యాఖ్యలు నాగరిక ప్రపంచం తలదించుకునేలా మారిందన్నారు. పోలీసులంటే భయం ఉంటే ఈ సంఘటనలు జరిగేవి కాదన్నారు. అలాగే బయట నియోజకవర్గాల నుంచి వచ్చిన టిడిపి కార్యకర్తలు ఉప ఎన్నిక జరిగే గ్రామాల్లో స్వైర విహారం చేశారన్నారు. పోలీసులు వారికి కావాల్సిన వ్యక్తులను గెలిపించాలని అనుకుంటే ప్రజాస్వామ్యం ఎందుకు? అని ప్రశ్నించారు. 20 ఏళ్ల కింద నాటు తుపాకులు, బాంబులు, ఈటలు పెట్టుకుని ఎన్నికలు చేసే సంస్కృతి ఉండేదన్నారు. కానీ ఇప్పుడు మళ్లీ ఆ సంస్కృతి తేవాలని చూస్తున్నారన్నారు. ఏదైతే చేయాలనుకున్నావో అదే నీకు శాపంగా మారుతుందని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కళ్లు తెరవాలన్నారు.



# పులివెందుల జడ్పిటిసి రీపోలింగ్‌ను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ



**కడప క్రైమ్ మేజర్‌న్యూస్ :** మంగళవారం పులివెందులలో జరిగిన జడ్పిటిసి ఎన్నికల్లో జరిగిన కొన్ని చెదురు మదురు సంఘటనలతో ఇరు పార్టీల ఫిర్యాదుతో ఎన్నికల కమిషనర్ తిరిగి రెండు పోలింగ్ బూతులను బుధవారం రీపోలింగ్ నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారు, అందులో భాగంగా పులివెందుల జెడ్పిటిసి ఉప ఎన్నికల రీపోలింగ్ సందర్భంగా జరుగుతున్న పోలింగ్ బూత్ నెం. 3 మరియు నెం.14 పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను బుధవారం జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ పరిశీలించారు. రెండు పోలింగ్ బూత్ లో అవాంఛనీయ సంఘటన జరగకుండా పూర్తి బందోబస్తున్ ఏర్పాటు చేశారు, అనుమానితులను ముందస్తుగా స్టేషన్ కు తరలించారు, పోలింగ్ బూతుల వద్ద బందోబస్తు పై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.

# వ్యవసాయ సహకార సంఘాలు గ్రామీణాభివృద్ధికి పునాది

## సంఘం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి



**కడప రూరల్ మేజర్‌న్యూస్ :** వ్యవసాయ సహకార సంఘాలు గ్రామీణాభివృద్ధికి పునాది అని, రైతుల సంక్షేమం కోసం, సంఘ అభివృద్ధి కోసం ఎల్లప్పుడు తాము అండగా ఉంటామని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఆలం ఖాన్ పల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బుధవారం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి, శ్రీనివాసరెడ్డి హాజరై, కొత్తగా ఎన్నికైన సంఘం చైర్మన్, డైరెక్టర్ల కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, డైరెక్టర్లు సమ్మర్లవంతంగా పనిచేస్తారన్న నమ్మకం తమకు ఉందని చెప్పారు. చైర్మన్ చంద్రశేఖర్, డైరెక్టర్లు మూర్తి, వెంకట చలపతి మాట్లాడుతూ మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, సంఘం అభివృద్ధి కోసం ఆహార్నిశలు కృషి చేస్తామని, బాధ్యతలు నిర్వహిస్తామని, ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాస రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాస రెడ్డికి దుష్యాలు వాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవయవదానంతో మరొకరికి జీవితం ఇవ్వవచ్చు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** అవయవదానంతో మరొకరికి జీవితం ఇవ్వవచ్చని పట్టణానికి చెందిన కొవ్వూరు రమేష్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక మైదుకూరు రోడ్డు లోని కొవ్వూరు గ్రాండ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అవయవదాన దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ అవయవదానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అవయవదానం వలన ఆరోగ్యంగా జీవించవచ్చనే విషయంలో తానే ఉదాహరణ అని వివరించారు. ప్రస్తుతం అవయవ మార్పిడికి, శస్త్రచికిత్స, మందులకు కూటమి ప్రభుత్వం సహాయం చేస్తోందని వివరించారు. అవయవదానంలో లివర్ మొదట కుటుంబ సభ్యులు, తర్వాత బంధువులు లేదా బ్రెయిన్ డెడ్ అయిన వారు ఇవ్వచ్చని, కిడ్నీ కూడా బ్రెయిన్ డెడ్ అయిన వారు, ఒకే రక్తవర్గం కలిగిన వారికి ఒక కిడ్నీ దానం చేసిన నష్టం వుండదని తెలియజేశారు. కావున అవయవదానానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# నేడు మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

## బద్వేల్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి




**బద్వేల్, మేజర్‌న్యూస్ :** బద్వేల్ మునిసిపాలిటీ కౌన్సిల్ సర్వసభ్యుల సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు బద్వేల్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాన్ని గురువారం ఉదయం 10:30 గం.లకు స్థానిక పురపాలక కార్యాలయంలోని సభాభవనం నందు కౌన్సిల్ సమావేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మునిసి పాలిటీ పాలకవర్గం పాల్గొని మున్సిపాలిటీ అభివృద్ధి సమస్యల పరిష్కారానికి సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

# చంద్రబాబు నాయుడుపై ఆరోపణలు చేయడం సరికాదు

## గతంలో మీరు చేసింది గుర్తు తెచ్చుకోవాలి - ఏజెంట్ల ను కూడా పెట్టుకోలేని పరిస్థితి వైసీపీ ది - వైయస్ జగన్ పై ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ఫైర్

**పులివెందుల మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి లో భయం పుట్టుకొచ్చిందని, ఆచరించి మాట్లాడితే బాగుంటుందని, ఏజెంట్లను కూడా పెట్టుకోలేని పరిస్థితి వైసీపీదని, గతంలో మీరు చేసింది గుర్తుతెచ్చుకోవాలని, నువ్వు చేసిన పాపాలే ఇప్పుడు అనుభవిస్తున్నామని వైయస్ జగన్ ను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. 2004 నుంచి 2009 మధ్యలో జరిగిన ఎన్నికలలో మీరు పులివెందుల నుంచి జమ్మలమడుగు, రాయచోటి , కడప నియోజకవర్గాలకు వెళ్లి చేసిన దౌర్జన్యాలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు, 2022లో జరిగిన శాసనమండలి పట్టుబద్రుల ఎన్నికలలో లింగాల మండలంలో మా ఏజెంట్లను తీర్చడమే కాకుండా దౌర్జన్యం చేయలేదా అని ప్రశ్నించారు. ఎన్నికల కౌంటింగ్ లో కూడా దౌర్జన్యాలు చేయడం జరిగింది అన్నారు. అప్పుడు పోలీసులతో మాపై దాడులు చేయించలేదని ప్రశ్నించారు. ఈరోజు చేసిన పాపం వాళ్లే అనుభవించాలని ఇప్పుడు అనుభవిస్తున్నామన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో నామినేషన్లు వేయకుండా ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర మీది అన్నారు. కుప్పం మున్సిపాలిటీలో ఎన్ని అరాచకాలు చేసినా మా ఏజెంట్ల పై దాడులు చేసిన ఎన్నిక అయ్యే వరకు నిలిచిన చరిత్ర మాది అన్నారు. బొత్స సత్యనారాయణ , కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో మంతనాలు చేస్తున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. షర్మిలను పిసిసి అధ్యక్షురాలుగా తొలగించి కొత్తవారిని నియమించాలని ప్రతిపాదనలు పంపలేదా అని ఆరోపించారు. ఐఏఎస్, ఐపీఎస్ లను బెదిరిస్తున్నారని చెప్పడం సిగ్గుచేటు అన్నారు గతంలో మీరు చేసింది ఇదే కదా అన్నారు. ఎన్నికలలో ఏజెంట్లను పెట్టుకోలేక పులివెందుల పరువును తీసిన చరిత్ర జగన్, అవినాష్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు బొజ్జ మైసూరా రెడ్డి పాల్గొన్నారు.



# పోలీసుల విధులకు ఆటంకం పరిచారని కేసు నమోదు

## జమ్మలమడుగు డిఎస్పి వెంకటేశ్వరరావు



**ఎర్రగుంట్ల మేజర్‌న్యూస్ :** ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పై కేసు నమోదు చేసి తీసుకుని వెళుతుండగా పోలీస్ విధులకు ఆటంకం కలిగించి నందుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి పై అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు జమ్మలమడుగు డిఎస్పి వెంకటేశ్వరావు తెలియజేశారు. బుధవారం సాయంత్రం నిడుజివ్వి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డిని అరెస్ట్ చేసిన అనంతరం రాత్రి ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికలలో భాగంగా ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డిని అరెస్టు చేసి తీసుకెళ్తుండగా ఎర్రగుంట్ల నాల్గు రోడ్ల కూడలి వద్ద కార్యకర్తలతో అడ్డగించి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి ధర్నా నిర్వహించారని తెలిపారు. పోలీసు కస్టడీలో ఉన్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని దించి నిడిజివ్వి గ్రామంలో తన ఇంటికి తీసుకెళ్లి అక్కడి నుంచి తప్పించి పులివెందులకు ఎంపీ వైఎస్ ఆవినాష్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి పంపించారని అన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని పోలీస్ కస్టడీ నుంచి తప్పించిన కేసులో విచారించడానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డిని కష్టడీకి తీసుకుని విచారణ చెస్తున్నామని చెప్పారు. ఈ కేసులో మరి కొంతమందిని విచారించాల్సి ఉందన్నారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం తెలియపరుస్తామని డిఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందులో చాలా మందిని విచారణ చేయాల్సి ఉందన్నారు.